# ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు కృషి చేయాలి..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని గణనీయంగా పెంచే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు . ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సౌకర్యార్థం కల్పిస్తున్న మౌలిక వసతులు మరియు ప్రభుత్వ పథకాలపై తల్లిదండ్రులకు, ప్రజలకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో విద్యాశాఖ, సాంఘీక సంక్షేమ, గిరిజన, మైనారిటీ, జ్యోతిబాపూలే సంక్షేమ శాఖల అధికారులు, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపల్స్, కస్తూర్బా గాంధీ పాఠశాలల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "బడిబాట" కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించి, ఈ నెల 12వ తేదీన పాఠశాలలను పునః ప్రారంభించాలని సూచించారు. పాఠశాలల పునః ప్రారంభానికి ముందే తరగతి గదులు, కిచెన్ షెడ్లు, డైనింగ్ హాల్స్, మరుగుదొడ్లు మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పాఠ్యపుస్తకాల పంపిణీకి సిద్ధం కావాలని ఆదేశించారు.



గతంలో విద్యార్థుల నమోదు లేక మూతబడిన పాఠశాలలను సందర్శించి, వాటిని పునః ప్రారంభించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని, అలాగే మండల విద్యాధికారులు గ్రామ సభల్లో పాల్గొని ప్రభుత్వ విద్యా ప్రమాణాలను ప్రజలకు వివరించాలని సూచించారు. 2026-27 విద్యా సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా ప్రతి మండలంలోనూ ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని అన్నారు .

జిల్లాలో భవిత కేంద్రాల సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని, దివ్యాంగ విద్యార్థుల అవసరాలను గుర్తిస్తూ మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాల సాధనలో భాగంగా ప్రతి మండలంలోనూ ఎక్కువ మంది విద్యార్థులున్న రెండు పాఠశాలలను ఎంపిక చేసి, అక్కడ అక్షరాస్యతా ప్రమాణాలను పెంచాలని సూచించారు. ఈ ఏడాది 48 పూర్వ ప్రాథమిక పాఠశాలలు మంజూరైనందున, 4 ఏళ్లు నిండిన పిల్లలు వాటిలో చేరేలా చూడాలన్నారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో కామన్ డైట్ మెనూను పక్కాగా అమలు చేయాలని, విద్యార్థుల కమిటీల భాగస్వామ్యాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు.అంతేకాకుండా, తంగళ్ళపల్లిలోని ట్రైబల్ వెల్ఫేర్ ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల, వేములవాడలోని సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలల్లో కోర్సులపై ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవగాహన కల్పించాలని, తద్వారా వారు ఉన్నత చదువులకు దూరం కాకుండా చూడాలని సూచించారు.

, జనగణన-2027 తొలి దశ ప్రక్రియను రాష్ట్రంలోనే అత్యంత వేగంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంలో జిల్లాను ముందంజలో నిలిపిన ఉపాధ్యాయుల కృషిని, అధికారుల బాధ్యతాయుత పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, మైనారిటీ అధికారి ఆయేషా తలత్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాల వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి..



**డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. రజిత**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

వర్షాకాలంలో వ్యాధుల నివారణే లక్ష్యంగా గ్రామ పంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఇంటింటి సర్వే నిర్వహించాలని డిఎం హెచ్వో డాక్టర్ ఎస్. రజిత వైద్యాధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్. రజిత అధ్యక్షతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.?ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ, ప్రతి మంగళ, శుక్రవారాల్లో 'డ్రైడే' పాటించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. దోమల లార్వాలను నివారించేందుకు డ్రైనేజీలలో అబేట్ ఆంటీ లార్వా మందులను పిచికారీ చేయించాలని, ఇళ్లలో కూలర్లు, ఇతర పాత్రల్లో నీటిని నిల్వ ఉంచకూడదని పేర్కొన్నారు. దోమల నుండి రక్షణకు జాలీలు, మెష్ డోర్లు అమర్చుకోవాలని, నిద్రించేటప్పుడు దోమతెరలు లేదా ఇతర రక్షణ మార్గాలను వాడాలని ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు .

?ఆశాలు, ఏఎన్ఎంలు ఇంటింటి సర్వేలో గుర్తించిన జ్వరపీడితులకు వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాల్లో రక్త పరీక్షలు నిర్వహించి, సకాలంలో చికిత్స అందించాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా డెంగ్యూ, మలేరియా కేసులు నమోదు కాకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.?అంతేకాకుండా, మాతా శిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారులకు దిశానిర్దేశం చేశారు. గర్భిణీ స్త్రీల నమోదు, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, ప్రభుత్వ ఆసుపత్రులలోనే సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని కోరారు. జాతీయ ఆరోగ్య పథకాల లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించి, జిల్లాను ఆరోగ్య రంగంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

?ఈ సమావేశంలో మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగేంద్రబాబు, వ్యాధి నిరోధక టీకాల ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంపత్ కుమార్, డీడియం కార్తీక్, జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిండు నూరేళ్లు వర్ధిల్లాలి..

**-బోయినిపల్లిలో రక్తదానం, ప్రత్యేక పూజలు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

చొప్పదండి శాసనసభ్యులు మరియు కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం జన్మదినాన్ని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మనబోయిన సువీన్ యాదవ్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు ఈ ఉత్సవాలను కేవలం సంబరాలకు మాత్రమే పరిమితం చేయకుండా, సేవా కార్యక్రమాలతో పండుగ వాతావరణంలో జరిపారు.

జన్మదిన వేడుకల్లో భాగంగా సువీన్ యాదవ్ ముందుగా తడగొండ సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యం నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని కోరుకుంటూ స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం బోయినిపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి, సంబరాలను జరుపుకున్నారు.ప్రజా సేవను ఆశయంగా మార్చుకున్న ఎమ్మెల్యే సత్యం ఆశయాలకు అనుగుణంగా, వర్ధవెల్లి గ్రామంలో భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి కాంగ్రెస్ శ్రేణుల నుండి విశేష స్పందన లభించగా, నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని సువీన్ యాదవ్ ప్రత్యేకంగా అభినందిస్తూ, వారికి పండ్లు, జ్యూస్ అందజేశారు.



ఈ సందర్భంగా సువీన్ యాదవ్ మాట్లాడుతూ, మేడిపల్లి సత్యం నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తూ చేస్తున్న సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు . మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని ఉన్నత స్థాయిలకు ఎదగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ సేవా కార్యక్రమాల్లో మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు మరియు సత్యం అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతఅని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు.ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 99 రోజుల కార్యాచరణలో భాగంగా ?ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ సమీపంలోని పోతిరెడ్డిపల్లె ఫారెస్ట్ రిజర్వ్ బ్లాక్ లో గల అర్బన్ ఫారెస్ట్ పార్క్ లో "ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కలెక్టర్ స్వయంగా మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

?ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని, అందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అడవుల విస్తీర్ణం పెరిగితేనే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, కాబట్టి మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామ నర్సరీల ద్వారా ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేస్తున్నామని, నాటిన మొక్కలను సంరక్షించేలా పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

?ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని ప్రతి గ్రామంలో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు. ఇప్పటికే హరిదాస్ నగర్ గ్రామంలో స్టీల్ బ్యాంకును ఏర్పాటు చేసిన సర్పంచ్ ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ స్టాల్‌ను పరిశీలించారు. అనంతరం అర్బన్ ఫారెస్ట్ పార్కులోని యోగా షెడ్, వాకింగ్ ట్రాక్, హెర్బల్ గార్డెన్, బుద్ధ విగ్రహం తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

?అర్బన్ ఫారెస్ట్ పార్కులో కల్పించిన వసతులు, పచ్చదనం గురించి ప్రజలకు తెలిసేలా సామాజిక మాధ్యమాల వేదికగా విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ఈ పార్కుపై సృజనాత్మక రీల్స్ పోటీలను నిర్వహించాలని, ఉత్తమ రీల్స్ రూపొందించిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని ప్రకటించారు. ఈ ప్రచారం ద్వారా పర్యావరణంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం, డీఎస్పీ నాగేంద్రచారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీఏఓ అఫ్జల్ బేగం, హార్టికల్చర్ అధికారి శరత్, డీవైఎస్ఓ రాందాస్, ఏడీ మైన్స్ క్రాంతి, ఎఫ్ఆర్ఓ నాగేశ్వర్ రావు, హరిదాస్ నగర్, పదిర సర్పంచులు నాగరాజు, మణెమ్మ, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.



# డివైడర్ మధ్యలో మొక్కలు నాటండి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల,**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) జంక్షన్ సుందరీకరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన డివైడర్ల మధ్యలో మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) జంక్షన్ లో సిరిసిల్ల మున్సిపల్ ఆద్వర్యంలో జంక్షన్ సుందరీకరణ, జోట, వస్త్ర పరిశ్రమలో వస్త్ర ఉత్పత్తిలో వివిధ దశలకు సంబంధించిన విగ్రహాలు, గ్రీనరీ, మొక్కల ఏర్పాటు పనులు కొనసాగుతుండగా, శుక్రవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు.వస్త్ర పరిశ్రమలో వస్త్ర ఉత్పత్తిలో వివిధ దశలకు చెందిన విగ్రహాలు ఏర్పాటు చేయగా. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అధికారులను అభినందించారు. జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన డివైడర్ల మధ్యలో మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ సూచించారు. త్వరితగతిన అన్ని సుందరీకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పరిశీలనలో మున్సిపల్ కమీషనర్ ఖదీర్ పాషా, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్, డీఈ వాణి, తదితరులు ఉన్నారు.







# ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్‌లో ముగ్గురు విద్యార్థుల ప్రతిభ

**చిగురుమామిడి మండలానికి చెందిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్షిప్**

**బలగం టీవీ ,చిగురుమామిడి**

ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్షిప్) పరీక్ష ఫలితాల్లో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి మెరిట్ స్కాలర్షిప్‌కు ఎంపికయ్యారు. రేకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కండె సహస్ర, బొమ్మనపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కొండబత్తిని సాక్షిత, ముల్కనూర్ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని కావ్యశ్రీ ఈ స్కాలర్షిప్‌కు ఎంపికై మండలానికి గర్వకారణంగా నిలిచారు. స్కాలర్షిప్‌లో ఎంపికైన ఈ విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు మొత్తం రూ.48 వేల ఆర్థిక సహాయం అందనుంది. విద్యార్థుల విజయంపై రేకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, బొమ్మనపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరావు, ముల్కనూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హర్జిత్ కౌర్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే రేకొండ సర్పంచ్ అల్లేపు సంపత్, బొమ్మనపల్లి సర్పంచ్ కొంకట మౌనిక, ముల్కనూర్ సర్పంచ్ సాంబారి భారతమ్మ-కొమురయ్యతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



# వాహనాలపై నంబర్ ప్లేట్లు లేకుంటే ఇక జైలే..

**-సిరిసిల్ల సీఐ శ్రీనివాస్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల :**

వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా తిప్పడం లేదా నంబర్లను మార్ఫింగ్ చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల సీఐ శ్రీనివాస్ అన్నారు . సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 20 వాహనాలను గుర్తించి, సదరు వాహనాలకు జరిమానా విధించడంతో పాటు, యజమానుల సమక్షంలోనే వెంటనే కొత్త నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేయించారు.

?ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, నేరాలను అరికట్టే క్రమంలోనూ, దొంగిలించబడిన వాహనాలను సులభంగా గుర్తించేందుకు ప్రతి వాహనానికి స్పష్టమైన నంబర్ ప్లేట్ ఉండటం అత్యవసరమని పేర్కొన్నారు.

?భవిష్యత్తులో కూడా ఇటువంటి తనిఖీలు కొనసాగుతాయని , వాహనదారులు ఇకపై నంబర్ ప్లేట్లు లేకుండా లేదా నంబర్లకు అడ్డుగా వస్తువులను అమర్చి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని అన్నారు. నిబంధనలను అతిక్రమించే వారిపై కఠినంగా వ్యవహరిస్తూ, అవసరమైతే చీటింగ్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఆర్ఎస్ఐ శ్రీనివాస్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మద్యపాన వ్యసనం నుండి కార్మికులు విముక్తి పొందాలి..

**- ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నంచందర్**


**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

మద్యపానం మనిషి జీవితాన్ని సర్వనాశనం చేస్తుందని, దీనిని వ్యసనంగా కాకుండా ఒక మానసిక సమస్యగా గుర్తించి సకాలంలో చికిత్స పొందాలని ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నంచందర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ సాధారణ వైద్యశాలలోని మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో గణేష్ నగర్‌లోని కార్మికుల కి మద్యపానం వల్ల కలిగే దుష్పరిణామాల పై అవగాహనా కల్పించారు.ఈ సందర్భంగా ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నంచందర్ మాట్లాడుతూ ?మద్యపానం తాత్కాలిక ఆనందాన్ని కలిగించినప్పటికీ, దీర్ఘకాలంలో వ్యక్తిగత, కుటుంబ, సామాజిక మరియు ఆర్థిక జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. మద్యపాన వ్యసనం కారణంగా కాలేయ వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, నరాల బలహీనతలు, మానసిక ఆందోళనలు, కుటుంబ కలహాలు మరియు ఆర్థిక ఇబ్బందులు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా కార్మికులు మద్యపానానికి దూరంగా ఉండటం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు కుటుంబ సంక్షేమానికి కూడా తోడ్పడగలరని సూచించారు.

మద్యపాన వ్యసనం ఒక సైకోసోమాటిక్ డిసార్డర్ అని వివరిస్తూ, సరైన చికిత్స, కౌన్సెలింగ్ మరియు కుటుంబ సభ్యుల సహకారంతో దీని నుండి పూర్తిగా విముక్తి పొందవచ్చని అన్నారు . మద్యపానం మానలేము లేదా చికిత్స వల్ల ప్రయోజనం ఉండదనే అపోహలను విడిచిపెట్టి, వ్యసనం నుండి బయటపడేందుకు ముందుకు రావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. పభుత్వ సాధారణ వైద్యశాలలోని మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా ఉచితంగా కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని, వ్యసనం నుండి బయటపడాలనుకునే వారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ సిబ్బంది బూర శ్రీమతి, కొండ ఉమ, రాపెల్లి లత మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు

# ఏటేటా పెరుగుతున్న పర్యావరణ విధ్వంసం!

ఏటా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నా..మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏటా జూన్ 5న మొక్కలు నాటడం, ఫోటలకు పోజులు ఇవ్వడం, సైకిల్ తొక్కడం వంటివన్నీ చేస్తున్న పాలకులు చిత్తశుద్ధితో పర్యావరణ పరిరక్షణ చర్యలకు పూనుకోవడం లేదు. పర్యావరణ విధ్వంసాన్ని ఆపేందుకు ఉపక్రమిచకపోవడం వల్ల ఎల్‌నినో లాంటి సమస్యలు ఉత్పాతంలా వచ్చి పడుతున్నాయి. ఈ యేడు కూడా నైరుతి ఆలస్యంగా ప్రవేశించింది. ఇంకా ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఒకప్పుడు జూన్ మాసం వచ్చే వరకు జోరు వర్షాలు పడేవి. కానీ ఆ పరిస్థితి ఇప్పుడు ఎక్కడా కానరావడం లేదు. పెరుగుతన్న జనాభే పర్యావరణ విధ్వంసానికి మొదటి చేటుగా గుర్తిచాలి. పెరిగన జనాభా తమ అవసరాల కోసం పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతోంది. దీనికి పాలకులే బాధ్యత వహించాలి. ఊరూరా చెరువులను మింగేస్తున్నారు. ఇసుకను,మట్టిని తోడస్తున్నారు. చెట్లను ఎడాపెడా నరికేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. కొండలను ఆనవాళ్లు లేకుండా చేసేస్తున్నారు. నదీ, సముద్ర జలాలను కలుషితం చేస్తున్నారు. నాలాలను ఆక్రమిస్తున్నారు. ఇవన్నీ కూడా పర్యావరణ విధ్వంసానికి పరాకాష్ఠగా చూడాలి. పర్యావరణం అంటే భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్నది ప్రకృతి అని అర్థం చేసుకోలేక పోతున్నాం. అడవుల విధ్వంసం వల్ల చిరుతలు, పెద్దపులుల జానావాసాల్లోకి వచ్చి పడుతున్నాయి. పంచభూతాలను రక్షించుకోవడం అన్నది మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం. మన చుట్టూ ఉన్న బాహ్య పర్యావరణం, రెండవది అంతర్గత పర్యావరణం. ఈ రెండింటినీ కూడా భగవంతుడే సృష్టించాడు. ఈ రెండింటి మధ్య సంబంధం ఉంది. దానిని మనం అర్థం చేసుకోవడం లేదు. పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయి. దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోంది. అందుకే నేడు ఈ పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది, దీనికి కారణం కాలుష్యం. హోలీ, దీపావళి, శరత్ పూర్ణిమ, వైశాఖి, మకర సంక్రాంతి, జన్మాష్టమి,రామ నవమి వంటి పర్వదినాలు ఆయా ఋతువులను అనుసరించి ప్రకృతి గొప్పతనాన్ని, సౌందర్యాన్ని మనకు తెలియ చేస్తున్నాయి. భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించారు. సౌరశక్తిని సూర్యదేవునిగా కొలిచారు. భారతీయ సంస్కృతిలో జలాన్ని కూడా దేవీ స్వరూపం గా భావించారు. నదులను జీవనదాయిని అయిన మాతలుగా భావించారు. అందుచేతనే ప్రాచీన సంస్కృతి నదీ తీరాల వెంబడి ఉద్భవించి ముందుకు కొనసాగింది. భారతీయ సంస్కృతిలో అరటి, రావి, మర్రి, తులసి, మామిడి మొదలైన చెట్లను పూజిస్తారు. వీటిని రక్షించుకోవడం కోసమే వీటిని పూజించేవారు. చెట్టు జాతులను ఇలా పూజించి రక్షించుకోవడం మన సంస్కృతికి మూలాధారం. పర్యావరణం అంటే మనల్నీ, మనపరిసరాలనూ, చెట్టూ,పుట్టా, గాలీ, నీరు, కొండాకోనా, వాగూవంకా,పిట్టాపిచికా, అన్నిటినీ రక్షించుకోవడం అన్న అర్థంలో చెప్పారు. అయితే కాలక్రమేణా మనమే మన పరిసరాలను దెబ్బతీసు కుంటూ వస్తున్నారు. ఏది చేసినా ఆలోచన చేయడం లేదు. పాలకుల విధ్వంసకర విధానాలవల్ల భారతదేశంలో పర్యావరణం దెబ్బతింటోందనడంలో సందేహం లేదు. పర్యావరణ పరిరక్షణలో కఠిన చట్టాలు ఉండాల్సిందే. వాటిని అమలు చేయాల్సిందే. కానీ అలా జరగడం లేదు. జూన్ 5న విశ్వవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు. దీన్ని పురస్కరించుకొని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ జాగృతపరిచే ప్రయత్నాలు చేస్తుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1972లో ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రపంచ సమ్మేళనం ఒకటి నిర్వహించింది. అన్ని దేశాలను ఆహ్వానించింది. స్వీడన్ లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో సుమారు 119 దేశాలు పాల్గొన్నాయి. అలా ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడం అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. భూగోళంపై 80శాతం జలం విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరు దొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై లేదా ఉప్పు నీటి రూపంలో ఉంది. లభించే కొద్దిపాటి శుద్ధజలం మానవ చర్యలవల్ల పనికిరాకుండా పోతోంది. దీనివల్ల కేవలం మనుషులేకాక సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. భూగర్భజల కాలుష్యాన్ని ఆపడానికి మనం తీవ్రంగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే వ్యవసాయానికి, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకం. జలాన్ని సంరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం మనందరి నైతిక బాధ్యత. మన సంస్కృతిలో నదులను మాతగా పూజిస్తారు. కానీ తల్లిగా భావించే గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడవచ్చు.నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నా, పాలకులు పట్టించుకోవడంలేదు. ప్రజలు అంతకు మించి అన్నట్లు మిన్నకుంటున్నారు. దీని పర్యవసానంగా దేశంలో ఉన్న ప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి. కాబట్టి నదులను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పబద్ధులం కావాలి. వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా నీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్య ఉత్పన్నమవుతుంది. కాబట్టి పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి. నదుల కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ వాటిని సంరక్షించుకోవాలి. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. మనకు జీవితాన్ని ప్రసాదించి, జీవనం కోసం ఉపయోగ పడుతున్న భూమిని తన స్వార్థ ప్రయోజనాలు, సుఖభోగాల కోసం అనేక రకాలుగా నష్టపరుస్తున్నాడు. ఆహారం, జీవనాన్ని ఇచ్చే భూమిని నాశనం చేస్తున్నాడు. గృహ వ్యర్థాలు, చెత్తాచెదారం వల్ల భూసారం దెబ్బ తింటోంది. మన దేశంలో ప్రతి రోజూ 15 వేల టన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు కొన్ని వందల సంవత్సరాల వరకు భూమిలో నాశనం కాకుండా నిల్వ ఉండి భూమి ఉత్పాదక శక్తిని తగ్గిస్తున్నాయి. పశుపక్ష్యాదులు వీటిని తినడం వల్ల చనిపోతున్నాయి. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ఉత్పాదకత మానవ జాతి మనుగడకే ప్రమాదం. దీని ప్రభావం పర్యావరణంపై పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు పాలుపడాల్సిన అవసరం ఉంది.



# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,730**

**బలగం టీవి, న్యూఢిల్లీ**

భారత్‌లో బంగారం ధరల్లో పతనం కొనసాగుతోంది. గత రెండు రోజులుగా తగ్గిన బంగారం ధరలో శుక్రవారం కూడా స్వల్ప స్థాయిలో కోత పడింది. అయితే, కొన్ని రోజులుగా స్థిరంగా ఉంటున్న వెండి ధర మాత్రం తగ్గింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,730కు పడిపోయింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధరలో రూ.380ల మేర కోత పడింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.350ల మేర తగ్గి రూ.1,42,750కు చేరుకుంది. ఇక నగరంలో కిలో వెండి ధరలో రూ.5 వేల మేర కోత పడింది. ప్రస్తుతం కిలో వెండి రూ.2.8 లక్షలుగా ఉంది. విజయవాడలో కూడా దాదాపు ఇవే రేట్స్ ఉన్నాయి. ఇక దేశవ్యాప్తంగా 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర సగటున రూ.350ల మేర తగ్గింది. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,57,960గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,300గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,730గా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,42,750గా ఉంది. దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,55,880గా, 10 గ్రాముల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,42,900గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ (31.10 గ్రాములు) 24 క్యారెట్ల పసిడి ధర 4,444 డాలర్ల వద్ద, ఔన్స్ వెండి ధర 72 డాలర్ల వద్ద కొనసాగుతోంది.పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ నేపథ్యంలో కొత్త పెట్టుబడుల విషయంలో మదుపరులు వేచి చూసే ధోరణిని ప్రదర్శిస్తున్నారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు బుధవారం రూ.5,616.56 కోట్లు, గురువారం రూ.4,447.06 కోట్ల నికర విక్రయాలు జరిపారు. డాలర్‌తో రూపాయి మారకం విలువ 2 పైసలు పెరిగి రూ.95.74 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒకదశలో 2.5 శాతానికి పైగా తగ్గి 95.33 డాలర్లకు దిగివచ్చింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.700 పెరిగి రూ.1,60,300 పలకగా.. కిలో వెండి రూ.3,800 తగ్గుదలతో రూ.2,65,700కు దిగివచ్చింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర 4,472 డాలర్లు, సిల్వర్ 73.56 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.



# అమ్మ స్మృతిలో పర్యావరణహితం..

**-స్టీలు ప్లేట్లు, గ్లాసుల వితరణ**

**--బొప్పాపూర్ పంచాయతీ వర్గానికి అందజేత**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్న వేళ, బొప్పాపూర్ గ్రామంలో కన్నతల్లి జ్ఞాపకార్థం ఆమె కుమారులు చేసిన సాయం ఇప్పుడు ఆ గ్రామాన్నే ప్లాస్టిక్ రహిత దిశగా నడిపిస్తోంది. బొప్పాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ మార్పు విజయలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు.

కన్నతల్లి జ్ఞాపకార్థం ఆమె కుమారులు ప్రశాంత్, శ్రీకాంత్ 2500 స్టీలు ప్లేట్లు, 2500 గ్లాసులను గ్రామ పంచాయతీకి అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఇల్లెందుల గీతాంజలి మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వల్ల భూమికి, పర్యావరణానికి కలుగుతున్న ముప్పును వివరిస్తూ, గ్రామస్తులందరూ ఇకపై శుభకార్యాల్లో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లను వాడటం మానేయాలని సూచించారు. అమ్మానాన్నల పేరిట చేసే సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండాపురం వెంకట్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాజీ ప్రియురాలి దారుణ హత్య

- కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన దుండగుడు
- అనంతరం అదే కత్తితో పొడుచుకున్న దుర్మార్గుడు
- యువతి మృతి..యువకుడి పరిస్థితి విషమం

**బలగం టీవి, చండీఘడ్**

పంజాబ్‌లో దారుణం చోటుచేసుకుంది. ఓ యువతి మాజీ ప్రియుడి చేతిలో దారుణ హత్యకు గురైంది. మాజీ ప్రియుడు ఆ యువతిని 20 సార్లు కత్తితో పొడిచి చంపాడు. యువతిని చంపిన తర్వాత అదే కత్తితో తనను తాను పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గురువారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మొహాలికి చెందిన హర్వీందర్ మన్ అలియాస్ హ్యారీ, డింపుల్ మూడేళ్ల క్రితం ఓ కంపెనీలో కలిసి పని చేశారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరి మధ్యా పరిచయం ఏర్పడింది. పరిచయం ప్రేమగా మారింది. కొన్ని నెలల క్రితం ఇద్దరూ కొత్త కంపెనీలో చేరారు. కొత్త కంపెనీలో చేరిన కొంతకాలం వీరి బంధం సజావుగానే సాగింది. తర్వాత నుంచి గొడవలు మొదలయ్యాయి. కొద్దిరోజుల క్రితం ఇద్దరూ విడిపోయారు. డింపుల్‌తో విడిపోవటం హ్యారీకి ఇష్టం లేదు. మళ్లీ ఆమెతో ఒక్కడవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. డింపుల్ ఇందుకు ఒప్పుకోవటం లేదు. దీంతో అతడు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. గురువారం డింపుల్ డ్యూటీలో ఉండగా.. రాత్రి 7.40 గంటల ప్రాంతంలో హ్యారీ ఆఫీస్‌కు వచ్చాడు. ఆమెతో గొడవ పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలోనే కత్తితో డింపుల్‌ను 20 సార్లు అతి కిరాతకంగా పొడిచాడు. తర్వాత అదే కత్తితో తన గొంతులో 30 సార్లు పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు. రక్తపు మడుగులో పడి ఉన్న ఇద్దరినీ సహోద్యోగులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం అందించారు. డింపుల్‌ను పరీక్షించిన వైద్యులు ఆమె చనిపోయినట్లు ధ్రువీకరించారు. హ్యారీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాలను అన్వేషిస్తున్నారు.

# యధాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు

**ద్రవ్యపరపతి విధానం ప్రకటించిన ఆర్‌బిఐ**

**రెపోరేటును యథాతథంగా కొనసాగిస్తూ నిర్ణయం**

**ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి**

**బలగం టీవి, ముంబై**



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇంతకుముందు ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన ద్రవ్య పరపతి సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను మార్చకుండా ఇలాగే ఉంచింది. అంతర్జాతీయ మార్కెట్లో అస్థిరత, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తు న్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం.

ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమీక్షల్లోనూ ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో

కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. సవాళ్ల నడుమ ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశ్చితిలో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మనకు ఎదురయ్యే ఆటుపోట్లను తక్కువ నష్టంతో తట్టుకోగలమని విశ్వాసంతో ఉన్నాం. ఇంధన ధరలు అధికంగా ఉండటంతో వృద్ధి నెమ్మదించింది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. దీనికి తోడు ఈ ఏడాది వర్షపాతం సాధారణం కన్నా తక్కువ ఉండటం కూడా ప్రభావం చూపించనుంది. అయితే, ఆహార నిల్వలు సరిపడా ఉండటం ఊరటనిచ్చే అంశం. అంతర్జాతీయంగా బలహీన డిమాండ్, రవాణా ఖర్చులు పెరగడం వంటివి ఎగుమతులకు సవాల్‌గా మారాయి. అయితే, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు మాత్రం చాలావరకు స్థిరంగా ఉన్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.9శాతం నుంచి 6.6శాతానికి తగ్గిస్తున్నాం. రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.6 శాతం నుంచి 5.1శాతానికి పెంచుతున్నాం. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లకు నిబంధనలను సరళీకరించాం. ఈక్విటీ మార్కెట్‌లో ఎన్‌ఆర్‌ఐలు, ఓవర్సీస్ సిటిజన్స్ పెట్టుబడుల పరిమితిని పెంచాం. ఎక్స్ఛేంజ్ రేట్‌పై ఆర్‌బీఐ విధానాల్లో ఎలాంటి మార్పు లేదు. మన దేశీయ కరెన్సీ రూపాయికి నిర్దిష్టమైన రేటును నిర్ణయించాలనుకోవడం లేదు.

పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆర్థికంగా ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ సిద్ధంగా, అప్రమత్తంగా ఉంది.

# వైభవంగా శ్రీకళ్యాణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

**శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహణ**

**బలగం టీవి, తిరుపతి**

తిరుపతి సమీపంలోని నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం చక్రస్నానం వైభవోపేతంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ దివ్య ఘట్టాన్ని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు భక్తి పారవశ్యంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. అంతకుముందు ఉదయం 7 గంటల నుండి 8.15 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పుష్కరిణి సమీపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9.15 గంటల నుండి 10.30 గంటల వరకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు,





చందనంతో అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో జరిగిన అన్ని సేవలు సఫలమై, లోకక్షేమం, సకాల వర్షాలు, ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం చక్రస్నానం నిర్వహించినట్లు ఆగమ పండితులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొని చక్రస్నానాన్ని దర్శించిన భక్తులు సమస్త పాప విముక్తులై, ఐశ్వర్యాలు, ధనధాన్య సమృద్ధిని పొందుతారని విశ్వాసం. రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు ధ్వజావరోహణం నిర్వహించి తొమ్మిది రోజుల పాటు వైభవంగా సాగిన బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి పలుకనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చెంగల్రాయులు, అర్చకులు, అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సాంకేతికతతో విద్యుత్ సేవల్లో వేగం..

**-సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయమైన సేవలు అందించడమే లక్ష్యమని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు.. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి పర్యటించినారు.

తంగళ్లపల్లి మండలం రాంచంద్రాపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఫీడర్ల వారీగా కొత్త బ్రేకర్లను ఆయన ప్రారంభించారు. వీటివల్ల పరిశ్రమలు, గృహాలు, వ్యవసాయానికి ప్రత్యేక సరఫరా అందుబాటులోకి వచ్చి విద్యుత్ అంతరాయాలు తగ్గుతాయని తెలిపారు. అనంతరం నేరెళ్లలో 1.4 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల స్టోర్స్‌ను తనిఖీ చేసి, వర్షాకాలంలో సామగ్రి భద్రతపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ లక్ష్యాలను మెరుగుపరుచుకోవాలని, కాలిపోయిన మీటర్లను మార్చాలని, కొత్త సర్వీసుల మంజూరు, వ్యవసాయం మరియు టీజీ ఐ-పాస్ సర్వీసులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు.

ఈ సందర్భంగా విద్యుత్ సేవల కోసం రూపొందించిన ఎల్టీఎంటీ యాప్‌ను ప్రారంభించారు. రుద్రవరంలో జిల్లాలోనే తొలిసారిగా రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టమ్ ను అందుబాటులోకి



తెచ్చారు. అత్యవసర సమయాల్లో విద్యుత్ పునరుద్ధరణ కోసం ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ వాహనాన్ని కూడా జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఎస్ఈ టి. వేణు మాధవ్, డివిజన్ స్థాయి అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.



# బూత్ స్థాయి నుండి పార్టీ బలోపేతమే లక్ష్యం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

బూత్ స్థాయి నుండి పార్టీ బలోపేతమే లక్ష్యముగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బిఆర్ఎస్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ తుల ఉమ, అన్నారు. శుక్రవారం ?సిరిసిల్ల నియోజకవర్గంలోని 6, 21, 25, 32, మరియు 36వ వార్డుల పరిధిలో బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ మరియు ఎస్ఐఆర్ ఓటర్ నమోదు ప్రక్రియపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ తుల ఉమ హాజరై మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు ప్రక్రియను అత్యంత బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో వార్డు అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు మరియు ముఖ్య నాయకులు సమన్వయంతో పనిచేస్తూ, అర్హులైన వారందరికీ ఓటర్ నమోదు ప్రక్రియలో అవగాహన కల్పించాలని సూచించారు. సభ్యత్వ నమోదు మరియు ఓటర్ నమోదులో తలెత్తే సందేహాలను నివృత్తి చేస్తూ, రాబోయే రోజుల్లో పార్టీ కార్యకలాపాలను మరింత వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. వార్డుల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని, పార్టీ శ్రేణులందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చిరు.ఈ కార్యక్రమం లో సిరిసిల్ల పట్టణ పార్టీ అధ్యక్షులు జిందం చక్రపాణి, మరియు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, పట్టణ కార్యదర్శి మ్యాన రవి, స్థానిక కౌన్సిలర్లు దూడం రజనీ శ్రీనివాస్, ఎలుక వెంకటేశం, బింగి రాంబాబు, కల్లూరి రేణుక రాజు, సయ్యద్



# భీమన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**బలగం టీవీ, వేములవాడ:**

చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం తన జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. ఆలయ ప్రోటోకాల్ పర్యవేక్షకులు గౌరీభట్ల శ్రీనివాస్ శర్మ స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డు ప్రసాదాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు.

ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

# జైస్వాల్‌తో కలిసి ఓపెనర్‌గా బరిలోకి రాహుల్



**బలగం టీవి, హైదరాబాద్**

న్యూచండీగఢ్‌లో జరుగుతున్న చారిత్రాత్మక భారత్ ఆఫ్గనిస్తాన్‌మొదటి టెస్ట్ మ్యాచ్‌కు ముందు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మీడియాతో మాట్లాడారు. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగబోయే జట్టు కలయికపై ఆయన కొన్ని కీలక సంకేతాలు ఇచ్చారు. ఆ సూచనల ఆధారంగా అఫ్గానిస్తాన్‌తో తలపడే భారత్ అంచనా తుది జట్టు ఇలా ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం టెస్ట్ ర్యాంకింగ్స్‌లో భారతదేశం తరపున అత్యుత్తమ స్థానంలో ఉన్న ఈ యువ ఓపెనర్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించడం ఖాయమైంది. జైస్వాల్‌తో కలిసి రాహుల్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు. ఈ మ్యాచ్‌కు అతడిని టీమిండియా వైస్ కెప్టెన్‌గా కూడా మేనేజ్‌మెంట్ నియమించింది. ఎడమచేతి వాటం బ్యాటర్ సాయి సుదర్శన్ నంబర్ 3 పొజిషన్‌లో బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉందని కోచ్ గంభీర్ హింట్ ఇచ్చారు. ఐపీఎల్ 2026లో 722 పరుగులతో సూపర్ ఫామ్‌లో ఉన్న సుదర్శన్, అదే జోరును టెస్టుల్లోనూ కొనసాగించాలని పట్టుదలగా ఉన్నాడు.జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన రెగ్యులర్ స్థానమైన నంబర్ 4లో బ్యాటింగ్‌కు రానున్నాడు. మెడ గాయం కారణంగా గువాహటిలో సౌతాఫ్రికాతో జరిగిన గత టెస్టుకు దూరమైన గిల్.. ఇప్పుడు పూర్తిగా కోలుకుని జట్టులోకి పునరాగమనం చేస్తున్నాడు. వికెట్ కీపర్ బ్యాటర్‌గా పంత్ నంబర్ 5లో బరిలోకి దిగనున్నాడు. అఫ్గానిస్తాన్‌తో జరిగే ఈ మ్యాచ్ పంత్‌కు కెరీర్‌లో 50వ టెస్ట్ కావడం విశేషం. ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా నితీష్ కుమార్ రెడ్డి తుది జట్టులో చోటు దక్కించుకోవడం దాదాపు ఖాయమైంది. బ్యాట్, బాల్ రెండింటితోనూ రాణించాలని ఈ యువ ఆటగాడు చూస్తున్నాడు. స్పెషలిస్ట్ స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా సుందర్ తుది జట్టులో ఉంటాడు. విదర్భ స్పిన్నర్ హర్ష్ దూబే.. మానవ్ సుతార్‌ను కాదని న్యూచండీగఢ్ టెస్టులో అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నాయి.ఐపీఎల్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినప్పటికీ, కుల్దీప్ స్థానానికి ఎలాంటి ఢోకా లేదు. రవీంద్ర జడేజా అందుబాటులో లేకపోవడంతో భారత స్పిన్ విభాగాన్ని అతడే ముందుండి నడిపించనున్నాడు. భారత పేస్ దళానికి సిరాజ్ నాయకత్వం వహించనున్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025–27 సైకిల్‌లో భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ అతడే కావడం గమనార్హం. పంజాబ్ అన్‌క్యాప్డ్ పేసర్ గుర్నూర్ బ్రార్ కంటే ప్రసిద్ధ్ కృష్ణకే తుది జట్టులో ఎక్కువ అవకాశం ఉంది. సిరాజ్‌తో కలిసి అతడు పేస్ బాధ్యతలను పంచుకోనున్నాడు.

**సాయి సుదర్శన్ నెంబర్ 3లో ఆడుతాడు**

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్ట్‌లో సాయి సుదర్శన్ నెంబర్ 3లో ఆడుతాడని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. ఇప్పటి వరకు అతనికి ఎక్కువ అవకాశాలు రాలేదని చెప్పాడు. అంతేకాకుండా ప్రస్తుతం అతను సూపర్ ఫామ్‌లో ఉన్నాడని గుర్తు చేశాడు. న్యూ చండీగఢ్ వేదికగా శనివారం నుంచి అఫ్గానిస్థాన్, భారత్ మధ్య ఏకైక టెస్ట్ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ మ్యాచ్ కోసం టీమిండియా సన్నాహకాలను పూర్తి చేసుకుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో శుక్రవారం గౌతమ్ గంభీర్ మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. టీమ్ కాంబినేషన్ గురించి ప్రశ్నించగా.. సాయి సుదర్శన్ నెంబర్ 3లో ఆడుతాడని స్పష్టం చేశాడు. తద్వారా దేవదత్ పడిక్కల్ బెంచ్‌కే పరిమితమవుతాడనే విషయాన్ని వెల్లడించాడు. 'సాయి సుదర్శన్‌కు ఇప్పటి వరకు తగిన అవకాశాలు రాలేదు. అతను ఇంగ్లండ్ పర్యటనలో కూడా ఆడాడు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అతనికి వరుస అవకాశాలు ఇవ్వాలనుకుంటున్నాం. మేం 11 మంది ఆటగాళ్లను మాత్రమే ఎంపిక చేయగలం. సాయి సుదర్శన్ ఏం చెత్త ఫామ్‌లో లేడు. ఐపీఎల్‌లో 700 పరుగులు చేశాడు. 4–5 మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా సాయి సుదర్శన్‌ను జడ్జ్ చేస్తే.. మేం జట్టును నిర్మించలేం. డబ్ల్యూటీసీ టైటిల్ గెలుస్తామనే నమ్మకం మాకుంది. జట్టులో ప్రతిభకు కొదవలేదు. ఆటగాళ్లంతా డబ్ల్యూటీసీ గెలవాలనే కసితో ఉన్నారు. ఐపీఎల్ ముగిసిన వెంటనే టెస్ట్ మ్యాచ్ జరుగుతుందని సాకులు చెప్పడానికి లేదు. టెస్ట్ మ్యాచ్‌లు అనేవి మెంటల్ టఫ్‌నెస్‌ను పరీక్షిస్తాయి. ఆగస్టులో వెళ్లే శ్రీలంక పర్యటన కోసం నలుగురు స్పిన్నర్లను సిద్ధం చేస్తున్నాం.మానవ్ సుతార్, హర్ష్ దూబే రూపంలో ఇద్దరు యువ స్పిన్నర్లు అందుబాటులో ఉన్నారు. ఈ మ్యాచ్ వారికి మంచి అవకాశం. శ్రీలంక పర్యటన కోసం నాలుగో స్పిన్నర్‌ను పరీక్షిస్తాం. న్యూజిలాండ్ పర్యటన కోసం కాస్త భిన్నంగా సన్నద్ధం కావాల్సి ఉంది. టెస్టులు ఆడే కొందరిని అఫ్గాన్‌తో వన్డే సిరీస్ నుంచి తప్పిస్తాం. టెస్టుల కోసం మరింత సన్నద్ధత అవసరమనేది మా భావన. రిషభ్ పంత్ తన ఆటను మార్చుకోవాల్సిన అవసరం లేదు. తన దూకుడు కొనసాగించాలి. కానీ అంతర్జాతీయ ఆటగాళ్ల పరిస్థితులకు తగ్గట్టుగా ఆడాలి.'అని గౌతమ్ గంభీర్ చెప్పుకొచ్చాడు. అఫ్గాన్‌తో మ్యాచ్‌లో కూడా టీమిండియా నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం కనిపిస్తోంది.

టీమిండియా తుది జట్టు (అంచనా): శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, రిషభ్ పంత్, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబే, కుల్దీప్ యాదవ్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ

**భారత్-ఆఫ్ఘనిస్తాన్ వన్డే సిరీస్ షెడ్యూల్**

మొదటి వన్డే: జూన్ 13 (శనివారం) -- ధర్మశాల (హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియం). రెండవ వన్డే: జూన్ 17 (బుధవారం) -- లక్నో (భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఏకానా క్రికెట్ స్టేడియం). మూడో వన్డే: జూన్ 20 (శనివారం) -- చెన్నై (చెపాక్)

# లార్డ్స్‌లో న్యూజిలాండ్ 113కే ఆలౌట్..



**బలగం టీవి, హైదరాబాద్**

లార్డ్స్ మైదానం వేదికగా జరుగుతున్న ఇంగ్లండ్ – న్యూజిలాండ్ మొదటి టెస్టు ఆసక్తికరంగా మారింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 140 పరుగులకు ఆలౌట్ కాగా.. న్యూజిలాండ్ 113 పరుగులకే పది వికెట్లు కోల్పోయింది. 65/6తో రెండో రోజు ఆట ప్రారంభించిన న్యూజిలాండ్ తొలి బంతికే గ్లెన్ ఫిలిప్స్ వికెట్ కోల్పోయింది. ఫిలిప్స్ అవుటయినప్పటికీ న్యూజిలాండ్ టెయిలెండర్స్ రాణించడం విశేషం. కైల్ జెమీసన్ రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 38 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.ఇంగ్లండ్ – న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న లార్డ్స్ టెస్టు రసవత్తరంగా సాగుతోంది. ఈ టెస్టులో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ జట్టు ఇంగ్లండ్‌ను తొలి ఇన్నింగ్స్ 140 పరుగులకే ఆలౌట్ చేసింది. ఇంగ్లండ్ కూడా అదే జోష్‌తో న్యూజిలాండ్ ఆరు వికెట్లు పడగొట్టింది. తొలి రోజే ఇరు జట్లు 16 వికెట్లు కోల్పోయింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ 65/7తో ముగించింది. రెండో రోజు ఆట ప్రారంభమైన తొలి బంతికే గ్లెన్ ఫిలిప్స్ వికెట్ కోల్పోయాడు. ఇంగ్లండ్ బౌలర్ జోష్ టంగ్ తొలి బంతికే ఫిలిప్స్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో న్యూజిలాండ్ 80 పరుగుల లోపే ఆలౌట్ అవుతుందని అందరూ అనుకున్నారు. కానీ బౌలింగ్‌లో ఐదు వికెట్లు తీసుకున్న జెమీసన్.. బ్యాట్‌తో కూడా రెచ్చిపోవడంతో న్యూజిలాండ్ 100 పరుగులు దాటేసింది. జెమీసన్‌కు తోడు నాథన్ స్మిత్ కూడా రాణించాడు. ఆఖర్లో వరుస వికెట్లు పడటంతో ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ స్కోర్‌కు 27 పరుగుల దూరంలో కివీస్ ఆలౌట్ అయింది. ఓవర్ నైట్ స్కోర్ 65/7 స్కోర్‌తో రెండో రోజు బ్యాటింగ్‌కి వచ్చిన న్యూజిలాండ్ జట్టు తొలి సెషన్‌లోనే ఆలౌట్ అయింది. గ్లెన్ ఫిలిప్స్ 65 పరుగుల వద్ద అవుటైన తర్వాత న్యూజిలాండ్ టెయిలెండర్స్ 48 పరుగులు జోడించడం విశేషం. కైల్ జెమీసన్ 29 బంతుల్లో రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 38 పరుగులతో నాటౌట్‌గా నిలిచి, ఇంగ్లండ్ బౌలర్లకు కాసేపు చెమటలు పట్టించాడు. అవతలి ఎండ్‌లో మరో బ్యాటర్ నిలబడినా మొదటి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ లీడింగ్‌లోకి వచ్చేసేది. విలియమ్ ఓరూర్క్ 1, మ్యాట్ హెన్రీ డకౌట్ కావడంతో 113 పరుగులకే ఆలౌట్ కావాల్సి వచ్చింది. ఇంగ్లండ్ బౌలర్లలో ఓలీ రాబిన్సన్ ఐదు వికెట్లు తీసుకోగా, జోష్ టంగ్ మూడు వికెట్లు పడగొట్టాడు. గస్ అట్కిన్సన్ రెండు వికెట్లు తీసుకున్నాడు. పేసర్లకే మొత్తం పది వికెట్లు దక్కడం విశేషం. కివీస్ 113 పరుగులకే ఆలౌట్ కావడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 27 పరుగుల ఆధిక్యం సాధించింది.

# పాకిస్థాన్‌పై యువ భారత్ సంచలన విజయం



**అండర్-18 ఆసియా కప్ ఫైనల్లోకి దూసుకెళ్లిన భారత జట్టు**

**అశిష్ తనీపూర్తి నాలుగు గోల్స్‌తో మెరుపులు**

**బలగం టీవీ, జపాన్**

అండర్–18 ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో యువ భారత్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన ఉత్కంఠభరిత సెమీఫైనల్ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 5–3 తేడాతో విజయం సాధించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది.

భారత జట్టు విజయంలో అశిష్ తనీపూర్తి కీలక పాత్ర పోషించాడు. 12వ, 49వ, 53వ, 56వ నిమిషాల్లో గోల్స్ సాధించి నాలుగు గోల్స్‌తో మ్యాచ్ హీరోగా నిలిచాడు. అతని అద్భుత ప్రదర్శనతో భారత్ అద్భుత విజయాన్ని అందుకుంది. మ్యాచ్ ఆరంభం నుంచే ఇరు జట్లు దూకుడుగా ఆడుతూ హోరాహోరీ పోరును ప్రదర్శించాయి. 12వ నిమిషంలో పాకిస్థాన్ రక్షణలో చోటుచేసుకున్న లోపాన్ని సద్వినియోగం చేసుకున్న అశిష్ తనీపూర్తి భారత జట్టుకు తొలి గోల్ అందించాడు.

అయితే అనంతరం పాకిస్థాన్ పుంజుకుని ఆధిక్యంలోకి వెళ్లింది. ఆఖరి క్వార్టర్ ముగిసే సమయానికి భారత్ 2–3తో వెనుకంజలో నిలిచింది. అయితే చివరి నిమిషాల్లో యువ భారత ఆటగాళ్లు అసాధారణ పోరాట పటిమను ప్రదర్శించారు. వరుసగా గోల్స్ సాధిస్తూ మ్యాచ్‌ను తమవైపు తిప్పుకుని పాకిస్థాన్‌పై 5–3 తేడాతో సంచలన విజయాన్ని నమోదు చేశారు. ఈ విజయంతో యువ భారత్ అండర్–18 ఆసియా కప్ ఫైనల్లోకి ప్రవేశించగా, టైటిల్‌పై ఆశలు మరింత బలపడ్డాయి. అశిష్ తనీపూర్తి ప్రదర్శన భారత విజయానికి ప్రధాన బలంగా నిలిచింది.



# శ్రీలంకలో అడుగుపెట్టిన ఇండియా-ఏ టీమ్..

**భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ మధ్య ట్రై సిరీస్**

**బలగం టీవి, హైదరాబాద్**

శ్రీలంక వేదికగా ఓ ట్రై సిరీస్‌ను బీసీసీఐ ప్లాన్ చేసింది. భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ దేశాల 'ఏ' జట్లను ఈ సిరీస్ కోసం ఎంపిక చేశారు. జూన్ 9 నుంచి మొదలయ్యే ఈ సిరీస్ జూన్ 21 వరకు సాగుతోంది. ఈ సిరీస్ కోసం ఇండియా ఏ జట్టు శ్రీలంకలో అడుగుపెట్టింది. ఈ సిరీస్‌లో అందరి దృష్టి ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ మీదే ఉంది. ఈ సిరీస్‌లో భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ శ్రీలంక గడ్డపై అడుగుపెట్టాడు. ఐపీఎల్ 2026లో విధ్వంసం సృష్టించిన 15 ఏళ్ల వైభవ్.. ఇప్పుడు ఇంటర్నేషనల్‌లో తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. శ్రీలంక వేదికగా జరగనున్న ట్రై సిరీస్ కోసం ఇండియా ఏ జట్టు శ్రీలంక చేరుకుంది. మొత్తం ఏడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ దేశాలు పాల్గొంటున్నాయి. భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ దేశాల మధ్య ట్రై సిరీస్ జరగనుంది. ఈ మూడు దేశాల ఏ కేటగిరి జట్లు ఈ ట్రై సిరీస్‌లో పాల్గొంటున్నాయి. ఈ సిరీస్‌కు శ్రీలంక ఆతిథ్యమివ్వనుంది. వన్డే ఫార్మాట్‌లో జరిగే ఈ సిరీస్ రానున్న ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ కోసం యువ ఆటగాళ్లను ఎంపిక చేసేందుకు ఉపయోగపడనుంది. ఈ సిరీస్‌లో ఐపీఎల్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇండియా ఏ జట్టుకు తిలక్ వర్మ కెప్టెన్‌గా వ్యవహరించనుండటం విశేషం. వైస్ కెప్టెన్‌గా ఎంపికైన రియాన్ పరాగ్ గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. దాంతో వైస్ కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంపిక చేశారు. బీసీసీఐ చెప్పిన ప్రకారం వన్డే ట్రై సిరీస్ మ్యాచ్‌లు డంబుల్లాలో జరుగుతాయి. ఈ సిరీస్ ముగిసిన వెంటనే ఇండియా – ఏ, శ్రీలంక – ఏ జట్ల మధ్య రెండు రోజుల రెడ్ బాల్ మ్యాచ్‌లు గాలేలో నిర్వహించనున్నారు. ఈ సిరీస్‌కు సంబంధించి భారత జట్టును ఇంకా ప్రకటించలేదు.

**ట్రై సిరీస్ ఫుల్ షెడ్యూల్**

భారత్ ఏ – శ్రీలంక ఏ జూన్ 9న, భారత్ ఏ – అఫ్ఘనిస్థాన్ ఏ జూన్ 11న, అఫ్ఘనిస్థాన్ ఏ – శ్రీలంక ఏ జూన్ 13న, భారత్ ఏ – శ్రీలంక ఏ జూన్ 15న, భారత్ ఏ – అఫ్ఘనిస్థాన్ ఏ జూన్ 17న, అఫ్ఘనిస్థాన్ ఏ – శ్రీలంక ఏ జూన్ 19న, జూన్ 21 ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

**ఇండియా - ఏ స్క్వాడ్**

ప్రియాన్ష్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ బదోనీ, నిశాంత్ సింధూ, అనుకుల్ రాయ్, సూర్యాన్ష్ షెడ్గే, విప్‌రాజ్ నిగమ్, రుతురాజ్ గైక్వాడ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, కుమార్ కుశాగ్ర, యశ్ ఠాకూర్, యుద్ధ్వీర్ సింగ్, అన్షుల్ కాంబోజ్, అర్షద్ ఖాన్.


# టీమిండియా కొత్త కెప్టెన్ గా శ్రేయస్ అయ్యర్?:

**బలగం టీవి, హైదరాబాద్**

ఇండియా టీ20 క్రికెట్ లో మరో సంచలన మార్పుకు తెర లేవనుంది. టీ20 వరల్డ్ కప్ 2026 టైటిల్ గెలిచిన కొద్ది నెలలకే సూర్యకుమార్ యాదవ్ ను కెప్టెన్సీ నుంచి తప్పించడానికి బీసీసీఐ సిద్ధమైంది. అప్కమింగ్ ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్లకు కొత్త కెప్టెన్ గా శ్రేయస్ అయ్యర్ బాధ్యతలు తీసుకోనున్నట్లు పలు కథనాల్లో వెల్లడైంది. ఆన్‌లైన్ లో జరగబోయే బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ లో ఈ డెసిషన్ ను అఫీషియల్ గా అనౌన్స్ చేయనున్నారు. సూర్య స్థానంలో నాలుగో నంబర్ బ్యాటర్ గా, లీడర్ గా శ్రేయస్ ను నియమించాలనే నిర్ణయం ఆల్రెడీ జరిగిపోయింది. అలాగే అక్షర్ పటేల్ ప్లేస్ లో యంగ్ ప్లేయర్ తిలక్ వర్మను వైస్ కెప్టెన్ గా ప్రమోట్ చేయనున్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సూర్యకుమార్ యాదవ్ ప్లేస్ లో సంజూ శాంసన్ ను టీ20 కెప్టెన్ చేయాలని గట్టిగా కోరుకున్నట్లు సమాచారం. అయితే బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ దీనికి అంగీకరించలేదు. సెలెక్షన్ కమిటీలోని ఇతర మెంబర్స్ కూడా గంభీర్ ప్రతిపాదనతో విభేదించారు. శాంసన్ కెరీర్ లో కన్సిస్టెన్సీ లేకపోవడమే దీనికి మెయిన్ రీజన్ అని వాళ్లు భావించారు. వరల్డ్ కప్ గెలిపించడంలో సంజూ కీలక పాత్ర పోషించినప్పటికీ, అతడిని లాంగ్ టర్మ్ కెప్టెన్సీ ఆప్షన్ గా సెలెక్టర్లు చూడటం లేదు. అంత పెద్ద రెస్పాన్సిబిలిటీ ఇవ్వడానికి ఇది సరైన టైమ్ కాదని సెలెక్టర్లు స్పష్టం చేశాడు.వరల్డ్ కప్ విన్నింగ్ స్క్వాడ్ లో లేని శ్రేయస్ అయ్యర్ ఐపీఎల్ లో మాత్రం అద్భుతంగా రాణించాడు. ఐపీఎల్ 2025 లో పంజాబ్ కింగ్స్ ను ఫైనల్స్ కు తీసుకెళ్లిన శ్రేయస్, రీసెంట్ గా ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్ లో కూడా బ్యాట్ తో మెరిశాడు. పంజాబ్ టీమ్ ప్లే ఆఫ్స్ చేరనప్పటికీ, శ్రేయస్ 14 మ్యాచుల్లో 168.81 స్ట్రైక్ రేట్ తో 498 రన్స్ చేశాడు. ఇందులో ఒక సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఈ సాలిడ్



పర్ఫార్మెన్స్ వల్లే అతడికి కెప్టెన్సీ ఛాన్స్ దక్కింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును వరుసగా రెండు సార్లు ఐపీఎల్ చాంపియన్ గా నిలిపి, బ్యాటింగ్ లో కూడా ఇరగదీసిన రజత్ పాటిదార్ పేరును మాత్రం సెలెక్టర్లు అస్సలు కన్సిడర్ చేయలేదు. లీడర్ షిప్ రేస్ లో అతడికి చోటు కల్పించడంపై ఎలాంటి డిస్కషన్ జరగలేదని సోర్సెస్ ద్వారా తెలిసింది. కేవలం శ్రేయస్ అయ్యర్ ను మెయిన్ లీడర్ గా ప్రొజెక్ట్ చేస్తూ టీమ్ ను ఫ్యూచర్ కోసం బిల్డ్ చేయాలని బోర్డు భావిస్తోంది. త్వరలోనే ఈ లైనప్ పై అఫీషియల్ ప్రెస్ నోట్ రానుంది.



# ఘోరంగా విఫలమైన లివింగ్ స్టోన్

**బలగం టీవి, హైదరాబాద్**

ఐపీఎల్ 2026 మెగా వేలంలో ఆటగాళ్లపై ఫ్రాంచైజీలు కోట్ల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్య మారన్ ఇంగ్లాండ్ విధ్వంసకర ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్ స్టోన్‌ను ఏకంగా రూ. 13 కోట్లకు సొంతం చేసుకుంది. మిడిల్ ఆర్డర్‌లో అతడు సిక్సర్ల వర్షం కురిపిస్తాడని ఫ్రాంచైజీ ఎన్నో ఆశలు పెట్టుకుంది. కానీ, తీరా ఐపీఎల్ 2026 సీజన్ ముగిసేసరికి కావ్య మారన్ తీసుకున్న ఈ నిర్ణయం ఎంత పెద్ద తప్పో అర్థమైందని క్రికెట్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ సీజన్‌లో లివింగ్ స్టోన్ ఘోరంగా విఫలమయ్యాడు. సన్‌రైజర్స్ తరపున కేవలం రెండంటే రెండు మ్యాచ్‌ల్లో మాత్రమే అతడికి ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగే అవకాశం దక్కింది. ఆ రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి అతడు చేసింది కేవలం 15 పరుగులు మాత్రమే. మిగిలిన బ్యాటర్లు పరుగుల వరద పారిస్తున్న వేళ లివింగ్ స్టోన్ తడబడటంతో, మేనేజ్‌మెంట్ అతడిని మిగతా మ్యాచ్‌లన్నింటికీ బెంచ్‌కే పరిమితం చేయాల్సి వచ్చింది. అయితే ఐపీఎల్ ముగిసిన తర్వాత లివింగ్ స్టోన్ సన్ రైజర్స్ హైదరాబాద్‌పై సంచలన కామెంట్స్ చేశాడు. తమ తుది జట్టు ఎంపికలో యాజమాన్యం జోక్యం ఉంటుందని లివింగ్‌స్టోన్ వ్యాఖ్యానించాడు. కేవలం ముగ్గురే విదేశీ క్రికెటర్లను ఆడించిన ఫ్రాంచైజీ.. తనకు అవకాశాలు మాత్రం ఇవ్వలేదని పేర్కొన్నాడు.అతడికి వేలంలో దక్కిన ధర (రూ. 13 కోట్లు), అతడు చేసిన పరుగులను (15 రన్స్) పోల్చి చూస్తూ సోషల్ మీడియాలో నెటిజన్లు దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. దాదాపు ఒక్కో పరుగుకు కోటి రూపాయల చొప్పున లివింగ్ స్టోన్ వసూలు చేశాడంటూ కామెంట్లు పెడుతున్నారు. పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న ఇతడిని వచ్చే సీజన్ కోసం జట్టులో కొనసాగించడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ తదుపరి మినీ వేలానికి ముందే అతడిని జట్టు నుంచి విడుదలచేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆ రూ. 13 కోట్ల పర్స్ మనీతో వేలంలో మరొక మంచి ఫామ్‌లో ఉన్న ఆటగాడిని కొనుగోలు చేయవచ్చని ఫ్రాంచైజీ భావిస్తున్నట్లు సమాచారం.

# రాబిన్సన్ బౌలింగ్‌లో వైభవ్ ఆడగలడా..?



**బలగం టీవి, హైదరాబాద్**

ఇంగ్లండ్ పేసర్ రాబిన్సన్ నిప్పులు చెరిగాడు. తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు తీసి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. మూడు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో లార్డ్స్ వేదికగా జరుగుతున్న తొలి మ్యాచ్‌లో రాబిన్సన్ ఈ ఫీట్ సాధించాడు. గురువారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో తొలి రోజు ఫస్ట్ ఓవర్‌తోనే రాబిన్సన్ ఆకట్టుకున్నాడు.

మెయిడిన్ ఓవర్‌తో పాటు మూడు కీలక వికెట్లు తీసాడు. రాబిన్సన్ ప్రదర్శనను చూసిన క్రికెట్ అభిమానులు.. వైభవ్ సూర్యవంశీని తెరపైకి తీసుకొచ్చాడు. రాబిన్సన్ బౌలింగ్‌లో వైభవ్ నిలబడగలడా? అనే చర్చకు తెరలేపారు. వర్షం కారణంగా ఈ టెస్ట్ మ్యాచ్‌కు కాసేపు అంతరాయం కలిగింది. ఆ తర్వాత కండిషన్స్ స్వింగ్‌కు అనుకూలించడంతో రాబిన్సన్ చెలరేగాడు. తొలి రెండు బంతులను డాట్ చేసిన అతను.. మూడో బంతిని డేవాన్ కాన్వేను ఔట్ చేశాడు. నాలుగో బంతిని డాట్ చేయగా.. ఐదో బంతికి కేన్ విలియమ్సన్ వెనుదిరిగాడు. ఆరో బంతికి రచిన్ రవీంద్రను పెవిలియన్ చేర్చి న్యూజిలాండ్‌ను కోలుకోలేని దెబ్బతీసాడు. మూడు వికెట్లతో పాటు మెయిడెన్ ఓవర్ వేసి ఇంగ్లండ్‌కు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. ఈ ఓవర్‌కు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలోనే ఆసక్తికర ప్రశ్న తెరపైకి వచ్చింది. ఇలాంటి అద్భుతమైన స్వింగ్ బౌలింగ్‌ను 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఆడగలడా? అనే చర్చ మొదలైంది. 'వైభవ్ ఇలాంటి స్వింగ్ కండిషన్స్‌లో నిలబడటం కష్టమే' అని కొందరు అంటే.. మరికొందరు అతను ఇంకా భారత జట్టుకు ఆడలేదని, ఇలాంటి కఠిన పరిస్థితుల్లో ఎలా ఆడతాడో అంచనా వేయడం సరికాదని కామెంట్ చేశారు.ఐపీఎల్‌లో వరల్డ్ క్లాస్ బౌలర్లు అయిన బుమ్రా, భువనేశ్వర్ కుమార్, రబాడ, జోష్ హేజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్‌లను చితక్కొట్టిన వైభవ్ సూర్యవంశీకి రాబిన్సన్ పెద్ద లెక్క కాదని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా ఐపీఎల్ ఆడినంత సులువు టెస్ట్ క్రికెట్ కాదని ఇంకొందరు కామెంట్ చేస్తున్నారు. బౌలర్లు రాజ్యమేలుతున్న ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 140 పరుగులకు ఆలౌటవ్వగా.. న్యూజిలాండ్ 113 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్‌లో హ్యారీ బ్రూక్(56) ఒక్కడే హాఫ్ సెంచరీ చేయగా.. న్యూజిలాండ్‌లో కైల్ జెమీసన్(38 నాటౌట్), గ్లేన్ ఫిలిప్స్(34) టాప్ స్కోరర్లుగా నిలిచారు. న్యూజిలాండ్ బౌలర్లలో కైల్ జెమీసన్(5/62) ఐదు వికెట్లు తీయగా.. ఇంగ్లండ్ రాబిన్సన్(5/39) ఈ ఫీట్ సాధించాడు. 27 ప రుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ నిలకడగా ఆడుతోంది.